నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 25 నవంబర్ 2024 | HYDERABAD

ఎమ్మార్పీ కంటే..అధికంగా..

సిటీబ్యూరో: నగరంలోని పలు మెడికల్ షాపులపై డీసీఏ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న 'ఇట్వేజ్-200 క్యాప్సుల్స్'ను స్వాధీనం చేసుకున్నారు. డీసీఏ డీజీ వీబీ కమలాసన్‌రెడ్డి కథనం ప్రకారం...'ఇట్వేజ్-200 ఎంజీ క్యాప్సుల్స్'ను ఉత్తరాఖండ్‌లోని పంత్నాగర్‌లోని టీవోఎస్‌సీ ఇంటర్నేషనల్ ప్రై.లి. అనే ఫార్మా కంపెనీ తయారు చేస్తున్నది. వీటిని చెన్నైలోని స్కినోసియన్ అనే సంస్థ మార్కెటింగ్ చేస్తున్నది. అయితే ఇట్వేజ్-200 ఎంజీ 10 మాత్రల ధరను రూ.247.74గా నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ నిర్ణయించింది. కానీ నిబంధనలకు విరుద్ధంగా స్కినోసియన్ మార్కెటింగ్ సంస్థ 10 మాత్రలను ఎమ్మార్పీ కంటే కంటే (రూ.51.25) అధికంగా రూ. 299కి విక్రయిస్తోంది. మాత్రలపై ఇవే ధరలను ముద్రించింది. ఈ మేరకు సమాచారం అందుకున్న డీసీఏ అధికారులు ఆదివారం అంబర్‌పేటలోని పలు మెడికల్ షాపులపై దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఇట్వేజ్-200 ఎంజీ క్యాప్సుల్స్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

రేపు హైదరాబాద్, సికింద్రాబాద్

పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశం

హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిటీబ్యూరో: తెలంగాణ భవన్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల స్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరుకావాలని తలసాని కోరారు.

విధుల్లోకి బల్దియా కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి సోమవారం నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండనున్నారు. ఎన్నికల పరిశీలకులుగా ఝార్ఖండ్ ఎన్నికల విధులు ముగించుకొని నగరానికి చేరుకున్న కమిషనర్.. సోమవారం జీహెచ్ఎంసీ విధుల్లో చేరనున్నారు. గడిచిన 25 రోజులుగా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటూ ఆయా శాఖల విభాగాల అధికారులతో దిశానిర్దేశం చేశారు. టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ వార్షిక బడ్జెట్, స్టాండింగ్ కమిటీ సమావేశాలు, సర్వసభ్య సమావేశాలపై పెండింగ్ పడడంతో వీటిపై కమిషనర్ దృష్టి సారించనున్నారు.

పగలూ గజగజ

సిటీబ్యూరో: ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే తక్కువకు పడిపోతుండటంతో గ్రేటర్‌లో చలి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నది. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో ఉదయం ఉష్ణోగ్రతలు సైతం పడిపోతుండడంతో పగలు సమయంలో కూడా చలి వణికిస్తున్నది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠం 2.2 తగ్గి 28.8 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే 2.3 తగ్గి 15.7 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 48 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. నగర శివారు ప్రాంతాలైన పటాన్‌చెరులో రాత్రి ఉష్ణోగ్రతలు 12.4, రాజేంద్రనగర్‌లో 14, హకీంపేటలో 15.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్లు తెలిపారు.

నాలాలపై హైడ్రా నజర్..!

నాలాల విస్తరణ, సమాంతర డ్రైయిన్ నిర్మాణంపై నిపుణులతో చర్చ

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులనే కొనసాగించే యోచన

ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్న కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): ముంపు ముప్పు నేపథ్యంలో హైదరాబాద్‌లో నాలాలపై హైడ్రా దృష్టిపెట్టింది. జీహెచ్ఎంసీతో పాటు ఔటర్ లోపల వరకు నాలాల విస్తరణ, సమాంతర డ్రైయిన్ నిర్మాణం అంశాలపై రిటైర్డ్ ఇంజినీర్లతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ చర్చించారు. నాలాల ఆక్రమణల తొలగింపు వల్ల స్థానికులతో వివాదాలు, పునరావాసం వంటి ఇతర అంశాలకు పెద్ద ఎత్తున నిధులు అవసరమున్న నేపథ్యంలో నాలాల విషయంలో హైడ్రా ప్రత్యామ్నాయ మార్గాల వైపు చూస్తున్నది. నాలాలకు సమాంతరంగా డ్రైయిన్ వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ పథకం కింద చేపట్టింది. ఇటీవల రాంనగర్‌లో నాలాలపై ఆక్రమణల తొలగింపు తర్వాత ఎదురైన అనుభవాల కారణంగా ఆక్రమణల తొలగింపు పక్కన పెట్టి గత ప్రభుత్వ ప్రణాళికనే అమలు చేస్తే బాగుంటుందని హైడ్రా భావిస్తున్నది. మూడురోజుల కిందట హైడ్రా కార్యాలయంలో జరిగిన సమావేశంలో చెరువుల పునరుద్ధరణతో పాటు నాలాలపై కూడా ఆసక్తికర చర్చ జరిగింది. ఇందులో నాలాలపై ఆక్రమణల తొలగింపు, పునరావాసం, పునరుద్ధరణ వంటి వాటికోసం లక్షకోట్లు అవసరమవుతాయంటూ రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పారు. దీనిపై చర్చ జరుగుతున్న సమయంలో ఎస్ఎన్‌డీపీ పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులను ప్రస్తావించారు. ఆక్రమణలు, తొలగింపులు వంటి అంశాలు కాకుండా నాలాలకు సమాంతరంగా డ్రైయిన్ నిర్మాణాలు చేపడితే వరద ముప్పు తగ్గే అవకాశముంటుందని, ప్రజలకు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఇంజినీర్లు అభిప్రాయపడ్డారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ ఈ కార్యక్రమం కొనసాగుతున్నదని, నాలాల ఆక్రమణల తొలగింపు కష్టసాధ్యమైన కారణంగా ఎస్ఎన్‌డీపీ విషయంలోనే ఇంజినీర్ల సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

సొంత పార్టీ నేతల నుంచే..

నాలాల పునరుద్ధరణలో భాగంగా అవసరమైన చోట వాటిని తొలగించే పనిని హైడ్రాకు అప్పగించారు. రాంనగర్‌లో జరిగిన ఆక్రమణల తొలగింపు తర్వాత నాలాల విషయంలో స్థానికులు ప్రధానంగా సొంత పార్టీ నేతల నుంచే ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిలు వచ్చాయని దీంతో హైడ్రా నాలాలపై ఆక్రమణల తొలగింపులో వెనక్కు తగ్గింది. మరి ముంపు సమస్యను పరిష్కరించడం ఎలా అన్నదానిపై ప్రభుత్వం, పురపాలక శాఖ, హైడ్రా బృందంతో సమీక్ష నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు ఇబ్బందులు కలగవద్దన్న ఆలోచనతో ప్రస్తుతం ఉన్న నాలాలకు సమాంతర డ్రెయిన్ల నిర్మించడానికి ఎస్ఎన్‌డీపీ పథకం కింద ప్రణాళికలు రూపొందించారు. కొన్నిచోట్ల పనులు కూడా జరిగాయి. మొదటిదశలో జీహెచ్ఎంసీ పరిధిలో రూ. 737 కోట్ల నిధులతో 35 పనులు చేపడితే 55 శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. గ్రేటర్ వెలుపల 248 కోట్లతో 21 పనులు చేపడితే 40 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు నివేదిక ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పనుల కొనసాగింపు లేకపోగా.. హైడ్రా పేరుతో కూల్చివేతలకు శ్రీకారం చుట్టింది. కానీ ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో తిరిగి బీఆర్ఎస్ ప్రణాళికలనే అమలు చేసి పనులు చేయడానికి నిపుణుల సలహాతో ముందుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ విషయంలో పురపాలకశాఖ హైడ్రా సహకారం తీసుకుంటున్నారని, ఈ క్రమంలో తాము నిపుణుల సలహాలు తీసుకుని నివేదిక తయారు చేస్తున్నామని హైడ్రా అధికారులు చెప్పారు.

ఆక్రమణల తొలగింపు కష్టమే..

జీహెచ్ఎంసీ పరిధిలో 370 కిలోమీటర్ల మేర మేజర్ నాలాలు ప్రవహిస్తున్నాయి.1250 కిలోమీటర్ల మేర వరద నీటి కాలువలున్నాయి. వరద, మురుగు నీటిని మోసుకెళ్తూ మూసీలో కలుస్తాయి. వీటి ప్రవాహవ్యవస్థ సామర్థ్యం కేవలం 2సెంమీలు మాత్రమే. కొన్నాళ్లుగా తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో వర్షపాతం నమోదవడంతో రహదారులన్నీ జలమయమవుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇందుకు నాలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడమే కారణంగా తెలుస్తోంది. గతంలో జీహెచ్ఎంసీ చేపట్టిన సర్వేలో నాలాలపై 12వేలకు పైగా ఆక్రమణలున్నట్లు గుర్తించారు. ఇందులో 35 శాతం మేర నివాసేతర నిర్మాణాలే ఉన్నట్లు గుర్తించారు. వాటి వల్ల కొన్నిచోట్ల 50 అడుగుల వెడల్పు ఉండాల్సిన నాలాలు 10 అడుగుల వెడల్పుకు చేరుకున్నాయి. ఫలితంగా చాలా ప్రాంతాలు జల దిగ్బంధంలో ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు.

కార్యరూపం దాల్చలేదు...

నాలాల సమగ్రాభివృద్ధికి పదివేల కోట్లు అవసరమని అధికారులు గతంలో ప్రణాళికలు రూపొందించారు. నిధుల కొరత, ఆక్రమణల తొలగింపు, పునరావాసం తదితర ఇబ్బందుల నేపథ్యంలో నాలాల పునరుద్ధరణ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ నాలాల వ్యవహారం తెరపైకి వచ్చింది. చెరువుల పునరుద్ధరణతో పాటు హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై హైడ్రా కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రేటర్‌తో పాటు హైడ్రా పరిధిలో ఉన్న నాలాల అంశంపై రిటైర్డ్ ఇంజినీర్లతో కమిషనర్ రంగనాథ్ అంశాల వారీగా చర్చించారు. చాలా చోట్ల ఈ సమస్య తీవ్రత ఎక్కువగా ఉందని వీటిని తొలగించడం కంటే ఎస్ఎన్‌డీపీ కింద పనులు చేస్తే బాగుంటుందని ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామని రంగనాథ్ చెప్పారు.

ఇంజినీర్ల సహకారం..

ఈ నేపథ్యంలో హైడ్రా ఇటీవల వర్షాకాలంలో నాలాలపై సర్వే కోసం ఇంజినీరింగ్ విద్యార్థుల సహకారాన్ని తీసుకున్నది. రాంనగర్ మణెమ్మకాలనీలో నాలాపై నిర్మించిన మూడంతస్తుల భవనాన్ని నేలమట్టం చేశారు. అదే తరహాలో మిగిలిన నాలాలపై ఆక్రమణలు కూడా తొలగించాలనుకున్నా.. అది ఆచరణలో చాలా కష్టమని తేలింది. నాలాల పునరుద్ధరణకోసం జేఎన్‌టీయూ, బిట్స్‌పిలానీలోని ఇంజినీరింగ్ విద్యార్థుల సహకారంతో హైడ్రా సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ఆక్రమణలకు సంబంధించిన అంశాలతో పాటు ప్రధానంగా ఎక్కడెక్కడ మెయిన్ పాయింట్స్‌లో సమస్య ఉందో కూడా నివేదిక రూపొందించారు. అయితే గతంలో జీహెచ్ఎంసీ చేసిన సర్వేతో పాటు ఇంజినీరింగ్ విద్యార్థుల సర్వే రెండింటిని కూర్చు చేసి సమస్య పరిష్కారం దిశగా అడుగులేసే యోచనలో హైడ్రా ఉంది. ఇప్పటికే ఈ నివేదికలు ఉన్న కారణంగా హైడ్రా కార్యాలయంలో రిటైర్డ్ ఇంజినీర్లతో జరిగిన సమావేశంలో నాలాలపై చర్చించారు. గ్రేటర్ లోపల నాలాల పరిస్థితిపై అధ్యయనం చేసి నాలాల నిర్మాణంపై అవగాహన ఉన్న కిషన్ వంటి ఇంజినీర్లతో ఒక కమిటీ వేసి వారి సలహాలతో ముందుకు పోవడానికి నిర్ణయించుకుంటున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి సర్వే రిపోర్ట్‌తో పాటు హైడ్రా సమావేశ నివేదికను అందించి తుది కార్యాచరణ రూపొందిస్తారని తెలిసింది.

యూసుఫ్‌గూడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన డిజిటల్ మీడియా ప్రిమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య విజయ్ తదితరులు. - జూబ్లీహిల్స్, నవంబర్24

చిన్నారులను వారియర్స్‌గా తీర్చిదిద్దుతున్నారు

కిమ్స్ పీడియాట్రిక్ వారియర్స్ డేలో మాజీ మంత్రి కేటీఆర్

గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో కిమ్స్ పీడియాట్రిక్ వారియర్స్ డే కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

శేరిలింగంపల్లి, నవంబర్ 24: ఐసీయూ పరిస్థితుల నుంచి చిన్నారులను ఆరోగ్యవంతులుగా మెరుగైన వైద్యసేవలు అందించి పునర్జన్మను ప్రసాదించి వారియర్స్‌గా తీర్చిదిద్దుతున్న వైద్యులు సేవలు మరిచిపోలేనివని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో లిటిల్‌వన్స్ క్యూర్ ఫౌండేషన్ అధ్వర్యంలో కిమ్స్ కడల్స్, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ సంయుక్తంగా నిర్వహించిన 'పీడియాట్రిక్ వారియర్స్ డే' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు తల్లిదండ్రులు ఎంత క్షోభ అనుభవిస్తారో ఓ తండ్రిగా తనకు తెలుసన్నారు. అలాంటి ఆపద పరిస్థితుల నుంచి అనారోగ్య సమస్యల నుంచి విజయవంతంగా వైద్యసేవలందించి పిల్లలను తిరిగి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో వైద్యుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. కిమ్స్ వైద్యశాల సీఎండీ బొల్లినేని భాస్కర రావు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన దాదాపు 700 మంది చిన్నారులను పీడియాట్రిక్ వారియర్స్‌గా లిటిల్‌వన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో కిమ్స్ వైద్యులు తీర్చిదిద్దారన్నారు.లిటిల్‌వన్స్ క్యూర్ ఫౌండేషన్ ట్రస్టీలు విద్యాభూషణ్, రాజేశ్వరరావు, కిమ్స్ హాస్పటల్ ప్రముఖులు బొల్లినేని అభినయ్, అధ్విక్, లక్ష్మారెడ్డి, పీడియాట్రిక్ వైద్య ప్రముఖులు డాక్టర్ అపర్ణ, డాక్టర్ ఫరాక్ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ధోఖా..!

స్ట్రీట్ వెండర్ జోన్‌లో ఖరీదైన దందా..

బల్దియా స్టాళ్లలో ఫర్నిచర్, బ్యాగుల దుకాణం, నర్సరీలు

చిరు వ్యాపారం జరగాల్సిన చోట.. బడా దుకాణాదారులకు స్టాళ్ల కేటాయింపు

సనత్‌నగర్ కేంద్రంగా అనర్హులకు అందలం

ఆదివారపు సంత.. చెప్పుల వ్యాపారి ఆధీనంలో జీహెచ్ఎంసీ స్టాల్

సిటీబ్యూరో/అమీర్‌పేట, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : వీధి వ్యాపారుల చట్టానికి జీహెచ్ఎంసీ తూట్లు పొడిచింది. వ్యాపారాలు కొనసాగించే జోన్లను గుర్తించి స్వేచ్ఛగా విక్రయాలు సాగించుకునేందుకు అవకాశం కల్పించాల్సిన అధికారులు ..అనర్హులకు కొమ్ముకాస్తున్నారు. వీధి వ్యాపారులకు ఎటువంటి నష్టం జరగకుండా రక్షణ కల్పించాల్సిన చోట కొందరు అధికారులు రాజకీయ నాయకులకు దాసోహం అవుతున్నారు. ఫలితంగా రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అన్నట్లుగా అన్నరులు, అధికారులు కలిసి అక్రమ దందాకు తెరలేపారు. సనత్‌నగర్ ప్రధాన రహదారి కేంద్రంగా స్ట్రీట్ వెండర్ జోన్ అక్రమార్కులకు అడ్డంగా మారింది. వీధి వ్యాపారులతో ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తులు చేతుల్లో ఈ దందా మూడు పువ్వులు-ఆరు కాయలు అన్నట్లుగా సాగుతున్నది.

18 స్టాళ్ల నిర్మాణం..

వీధి వ్యాపారుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీహెచ్ఎంసీ సనత్‌నగర్ ప్రధాన రహదారిలోని పారిశ్రామికవాడ పార్కు ప్రహరీకి ఆనుకుని 18 స్టాళ్లను నిర్మించి ఇచ్చింది. అప్పట్లో ఈ స్టాళ్లు స్ట్రీట్ వెండర్ కార్డులు కలిగి ఉన్న వారికే మంజూరైనా.. మారిన పరిస్థితుల్లో క్రమంగా ఈ స్టాళ్లు వీధి వ్యాపారాలతో ఏ మాత్రం సంబంధం లేని వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అడ్డదారుల్లో స్ట్రీట్ వెండర్ కార్డులు దక్కించుకున్న వారి చేతుల్లోకి స్టాళ్లు వచ్చి చేరాయి. అయితే తోపుడు బండ్ల మీద వ్యాపారాలు చేసుకునే వారి కోసం కేటాయించిన ఈ షాపుల్లో ఇతర వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఫాస్ట్ ఫుడ్ కోర్ట్స్, ఫర్నిచర్ షాపులు వంటివి దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి ఇక్కడి స్టాళ్ల నిర్వహణకు విద్యుత్‌తో అవసరం ఉండదు. అయినప్పటికీ స్టాళ్ల నిర్వాహకులు తమ పలుకుబడితో ఇక్కడ రెండు విద్యుత్ మీటర్లను సాధించుకోవడం గమనార్హం.

సొమ్ము చేసుకునేందుకే..

అడ్డదారుల్లో స్టాళ్లను దక్కించుకున్న పలువురు నాయకులు, వారి శిష్య బృందాలు వీటిని సొమ్ము చేసుకునే పనుల్లో పడ్డారు. ఈ స్టాళ్లను సొంతం చేసుకున్న వారిలో ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం ఉన్న వారే ఎక్కువ. సమాజంలో బిగ్ షాట్‌లుగా గుర్తింపు ఉన్న ఇద్దరు ముగ్గురు సైతం తమ వద్ద ఉన్న స్ట్రీట్ వెండింగ్ కార్డులతో ఇక్కడ స్టాళ్లు దక్కించుకున్నారు. ఇక ఏటా ఈ స్టాళ్లు నెలకొన్న స్థలంలోనే సనత్‌నగర్ క్రాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద ఎత్తున తమ దుకాణాలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే ఈ పటాకుల దుకాణాల ఏర్పాటుతో పాటు వ్యాపారాలకు కొత్తగా నిర్మించిన స్టాళ్లు, వారి ఆధీనంలో ఉన్న ఫుట్‌పాత్‌లు అడ్డంకిగా మారాయి. దీంతో క్రాకర్స్ దుకాణాల నిర్వాహకులు ఏకంగా స్టాళ్లతో సహా మొత్తం ఫుట్‌పాత్‌లను వారం రోజుల పాటు తమ వ్యాపారాల కోసం పెద్దమొత్తంలో చెల్లించి అద్దెకు తీసుకుంటారు. ఆ వారం రోజుల పాటు ఈ స్టాళ్ల వ్యాపారులు అక్కడ కనిపించరు. ఇక ప్రతి ఆదివారం ఇక్కడ జరిగే ఎర్రగడ్డ సంతలో జీహెచ్ఎంసీ స్టాళ్లు దక్కించుకున్న వారికి బాగా కలిసి వస్తున్నది.ఈ 18 స్టాళ్లున్న పరిసరాలు, ఫుట్‌పాత్‌లను సంతలోని వ్యాపారులు ఆదివారం మొత్తం వారి ఆధీనంలోకి తీసుకుంటారు. ఇందుకు కూడా వారు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ సనత్‌నగర్‌లో నిర్మించిన 18 స్ట్రీట్ వెండింగ్ స్టాళ్లను ఇప్పటికైనా అసలైన వీధి వ్యాపారులకు కేటాయించాలనే డిమాండ్ పెరుగుతున్నది.

నీరుగారుతున్న లక్ష్యం

నిరంతరం వ్యాపారాలు చేసుకునే జోన్లు (గ్రీన్ జోన్స్), పాక్షికంగా ఎంపిక చేసిన సమయాల్లో మాత్రమే వ్యాపారాలు చేసే జోన్లు (యాంబర్ జోన్స్), వ్యాపారాలు నిషేధించిన జోన్లు (రెడ్ జోన్స్)గా ఎంపిక చేస్తున్నారు... స్ట్రీట్ వెండర్స్‌గా గుర్తించిన వారికి గుర్తింపు కార్డులను అందిస్తున్నారు. తోపుడు బండ్ల నిర్వాహకులు, ఎలక్ట్రిషీయన్లు, రోడ్ల వెంబడి దుకాణాలు, చేపలు, పండ్ల వ్యాపారాలు, టైలరింగ్ తదితర వ్యాపారులను అర్హులుగా గుర్తించి.. వారికి రూ.10వేల రుణం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యాపారుల్లో ఎక్కువ శాతం చదువుకోని వారు ఉండడంతో వారి వ్యాపారాభివృద్ధికి జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ (యూసీడీ) విభాగం అధికారులు అవసరమైన శిక్షణ ఇస్తున్నారు.

సర్కారు భూముల ఆక్రమణలెన్నో..?

కబ్జాలకు గురైన భూముల వివరాలు సిద్ధం

రెవెన్యూ రికార్డుల ఆధారంగా జాబితా

మేడ్చల్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో కబ్జాలకు గురైన భూముల వివరాలను సేకరించి నివేదికలను స్థానిక మండలాల తహసీల్దార్లు తయారు చేసినట్లు అధికారుల ద్వారా తెలిసింది. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న సర్వే నంబర్లలో కబ్జా చేసి నిర్మాణాలు చేసిన వారి పేర్లతో పాటు ఎంత భూమి ఆక్రమణకు గురైన వివరాలను తహసీల్దార్లు సేకరించినట్లు సమాచారం. జిల్లాలో సుమారు 3 వందల సర్వే నంబర్లలో 5,195 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గతంలో రెవెన్యూ రికార్డుల్లో ఉన్న విషయం తెలిసిందే. ఐదు నియోజకవర్గాల్లోని మండలాల్లో రెవెన్యూ రికార్డుల ప్రకారం బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట మండలంలో 420, దుండిగల్ మండలంలో 425, మేడిపల్లి మండలంలో 900, ఘట్‌కేసర్ మండలంలో 500, కాప్రా మండలంలో 400, కీసర మండలంలో 600, బాచుపల్లి మండలంలో 360, కుత్బుల్లాపూర్ మండలంలో 600, ఉప్పల్ మండలంలో 333, మల్కాజిగిరి మండలంలో 113, మేడ్చల్ మండలంలో 37 ఎకరాలు ఉన్నాయి. కబ్జాకు గురైన ప్రభుత్వ భూముల వివరాల సేకరణలో స్థానిక తహసీల్దార్లు తయారు చేసిన జాబితాలో ఎంత ప్రభుత్వ భూమి కబ్జాకు గురైన లెక్క తేలినట్లు తెలుస్తున్నది. వివరాలను మాత్రం అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. అయితే ప్రభుత్వ భూములు కబ్జాలు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు..? ఆ భూములను ఎలా స్వాధీనం చేసుకుంటారు..? అన్నది వేచి చూడాల్సిందే.

పెద్దలకు తలొగ్గుతున్న అధికారులు..?

ధన, అధికార బలమున్న పెద్దలకు అధికారులు తలొగ్గుతున్నట్లు తీవ్రమైన ఆరోపణలొస్తున్నాయి. ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులే కబ్జాలు చేసే రాజకీయ పెద్దలకు అండగా నిలుస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. దీంతో భూ పరిరక్షణ పెద్ద టాస్క్‌గా మారింది.